క్లుప్తంగా

ఉరుసులో ఎమ్మెల్యే



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

కొత్తచెరువు: స్థానిక హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి ఉరుసు మహోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి చాదర్ గలఫ్‌ను తీసుకువచ్చి స్వామి వారి సమాధిపై పరచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి విజయం తథ్యమన్నారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, దర్గా కమిటీ మేనేజర్ అతావుర్ రహిమాన్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, నాగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు సాంబశివారెడ్డి, రఫి, షాన్‌షేట్, వాల్మీకి శంకర్, వడ్డె భాస్కర్, పెయింటర్ కేశవ, సుబ్బారావు, గిరి, అయ్యూబ్, గొడ్డాల్ జాకీర్, మున్వర్, బాబు, డీలర్ శీన, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించండి

ఎన్‌పీకుంట: నులిపురుగుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి నాలుగు రోజులు 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శాంతమ్మ, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జయ జయ సింహా.. జయ నరసింహా



రథంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



ఆలయంలో ఉరుముల సందడి

- హోరెత్తిన గోవింద నామస్మరణ

కదిరి: ఓ వైపు ఎండలు మండుతున్నా భక్తులు ఏమాత్రం లెక్క చేయకుండా తమ ఇలవేల్పు దేవుడు లక్ష్మీ నరసింహ స్వామిని బ్రహ్మ రథంపై దర్శించుకున్నారు. రథంపైకి దవణం, మిరియాలు చల్లేందుకు భక్తులు పోటీ పడ్డారు. మూడు లక్షల మందికి పైగా భక్తులు సోమవారం కదిరిలో జరిగిన బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్నారని పోలీసు నిఘా వర్గాల అంచనా. పట్టణంలోని తిరు వీధులే కాకుండా అన్ని ప్రధాన రహదారులతో పాటు నృసింహాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. తిరుమాడ వీధుల్లో జయ జయ సింహా–జయ నరసింహా అన్న గోవింద నామస్మరణతో హోరెత్తిపోయింది. రథోత్సవం ముగిసిన అనంతరం తేరుపై శ్రీవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరడం కన్పించింది.

అడుగడుగునా అన్నదానం..

భక్తుల దాహార్తి తీర్చడంతో పాటు వారి ఆకలి తీర్చేందుకు పట్టణంలోని దాతలకు కొదవలేదు. పట్టణంలో అడుగడుగునా ఉచిత అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో సైతం అన్నదాన కేంద్రం రాత్రింబవళ్లు కొనసాగించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్‌వీ కన్స్ట్రక్షన్ వారు స్థానిక పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో రోజంతా పెళ్లి భోజనాన్ని తలపించే విధంగా భక్తుల ఆకలి తీర్చారు.

ఎమ్మెల్యే కృతజ్ఞతలు..

బ్రహ్మ రథోత్సవంలో ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకుండా సహకరించిన భక్తాదులందరికీ కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఆలయ కమిటీ చైర్మెన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, ఈఓ పట్టెం గురుప్రసాద్, కదిరి డీఎస్పీ భవ్య కిషోర్‌లు రథోత్సవం విజయవంతంగా సాగినందుకు భక్తులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



బ్రహ్మ రథోత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని

నృసింహుని రథోత్సవ సైడ్‌లైట్స్

శ్రీదేవి, భూదేవిల సమేత లక్ష్మీ నారసింహుడు సోమవారం బ్రహ్మ రథంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధులన్నీ భక్తులతో పోటెత్తాయి. ఏ మిద్దెపై చూసినా భక్తులే కన్పించారు. రథోత్సవంలో 3 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు అంచనా.

- బ్రహ్మరథం సరిగ్గా ఉదయం 8.11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.24 గంటలకు యథాస్థానం చేరుకుంది. తేరు కదలికలను అదుపు చేయడం కోసం తెడ్లు వేసే అనుభవజ్ఞులు ఎప్పటిలాగానే ఈసారి కూడా బాగానే శ్రమించారు.
- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డితో పాటు ఇంకా పలు రాజకీయ పార్టీల నాయకులు రథోత్సవంలో పాల్గొని భక్తులను ఉత్సాహ పరిచారు.
- రథం తిరు వీధుల గుండా వెళ్తుంటే భక్తులు దవణం, మిరియాలు, అరటి పండ్లు రథం పైకి విసిరి స్వామి వారిని స్మరించుకున్నారు.
- జేబు దొంగలు ఎప్పటిలాగానే ఈసారి కూడా తమ హస్తలాఘవాన్ని ప్రదర్శించారు. చాలా మంది భక్తులు తమ నగదు, సెల్ ఫోన్లు పోగొట్టుకున్నామని లబోదిబో మన్నారు.
- యువత చొక్కాలు చింపడం, రంగులు చల్లుకోవడం తమ ఆనవాయితీని ఈసారి కూడా కొనసాగించారు.
- మిద్దెలపై నుండి కొందరు రథంలాగే భక్తుల మీదకు బిందెలతో నీళ్ల చల్లారు.
- బ్రహ్మోత్సవాల కోసం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. అయితే వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సుల్లో ప్రయాణం చేసిన వారి నుండి ఎక్కువ చార్జీలు వసూలు చేశారని ప్రయాణికులు కొందరు వాపోయారు.
- రథోత్సవాన్ని తిలకించేందుకు తిరు వీధుల్లోని మిద్దెలపైకి ఎక్కిన భక్తుల నుంచి కొందరు నిచ్చెనలు వేసి ఒకొక్కరి దగ్గర రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేశారని భక్తులు పేర్కొన్నారు.
- నృసింహాలయంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండటం కన్పించింది.
- ఆలయ ప్రాంగణంలో తలనీలాలు సమర్పించు కునేందుకు భక్తులు టికెట్ కొనుక్కున్నప్పటికీ వారి నుండి గుండుకు రూ100 నుండి రూ200 దాకా అదనంగా వసూలు చేసినట్లు భక్తులు ఆరోపించారు.



కదిరి పురవీధుల్లో యువకుల కోలాహలం



నీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంచుతున్న దృశ్యం



తెడ్లకు పూజలు నిర్వహించిన దృశ్యం



ఆలయంలో స్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



ధర్మవరంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు



కొత్తచెరువులో ఓటర్ల సందడి



కదిరి బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు వెళ్తున్న దృశ్యం

ఓటెత్తిన చైతన్యం

- ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఓటర్లు పోటెత్తారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజక వర్గాలకు సోమవారం జరిగిన పోలింగ్‌లో ఉదయం 8 గంటల నుంచి క్యూలో నిలబడి ఓటు వేశారు. ఆయా మండలాల అధికారులు సూచించిన మేరకు గుర్తింపు కార్డులు తీసుకెళ్లి ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నెల రోజుల పాటు అవిశ్రాంతంగా ప్రచారం నిర్వహించి ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన కల్పించారు. దీంతో పెద్ద ఎత్తున ఓటర్లు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేశారు.

పుట్టపర్తి నియోజక వర్గంలో టీచర్ల ఎమ్మెల్సీకి 461 మంది ఓటర్లు ఉండగా 417 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సుమారు 90.4 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక పట్టభద్రుల ఓటర్లు 6,914 మంది ఉండగా 5,256 మంది ఓటర్లు ఓటు వేసి సుమారు 76 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నల్లమాడలో 75 శాతం పోలింగ్

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్లు 75.79 శాతం పోలయ్యాయి. పుట్టపర్తి ఆర్‌డీఓ భాగ్యరేఖ స్థానిక తహసీల్దార్ దేవేంద్రనాయక్‌తో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

పోలింగ్ ప్రశాంతం

అమడగూరు: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అమడగూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓటింగ్‌లో 72.9 శాతం, ఉపాధ్యాయులు ఓటింగ్‌లో 96.4 శాతం పోలింగ్ నమోదైనట్లు డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. జెడ్పీటీసీ కవిత తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొత్తచెరువు: కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టభద్రుల ఓటింగ్ 79.6 శాతం, ఉపాధ్యాయులు 95 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా ఉపాధ్యాయులు 35 మంది ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, సీఐ జయనాయక్, సిబ్బంది ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించారు.

ఓడీ చెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలో వేచి ఉన్నారు. పట్టభద్రులు 74 శాతం, ఉపాధ్యాయులు 97 శాతం పోలింగ్ నమోదైంది. ఎమ్మెల్యే దుద్దుకుంట పోలింగ్ సరళిని వైఎస్సార్‌సీపీ నాయకులతో అడిగి తెలుసుకున్నారు.

బుక్కపట్నం మండలంలో..

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో 74.78 శాతం పోలింగ్ నమోదైంది.67 మంది ఉపాధ్యాయుల ఓట్లకు గాను 55 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి 82 శాతం పోలింగ్ నమోదైంది. బుక్కపట్నం పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ బసంత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి పరిశీలించారు.

బారులు తీరారు.

ధర్మవరం, ధర్మవరం అర్బన్: ఓటరు చైతన్యం ఉరకలేసింది... ఓటు హక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఎంతో ఓపికగా వేచి ఉండి మరీ తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ధర్మవరం పట్టణంతోపాటు ధర్మవరం మండలం, ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎన్నుకునేందుకు ఓటర్లు తరలివచ్చారు. మొత్తం పట్టభద్రుల ఎమ్మెల్సీకి నియోజకవర్గ వ్యాప్తంగా 12 పోలింగ్ కేంద్రాల్లో 9,560 ఓట్లు ఉండగా 7,294 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 76.88గా నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ శాతం 94.47గా నమోదైంది. నియోజకవర్గలలో మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు 652 మందికి గాను 616 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 94.47శాతం నమోదైంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టభద్రులు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రం ముందు బారులు తీరారు. ఆర్డీఓ తిప్పేనాయక్, ముదిగుబ్బ ఇన్‌చార్జి సీఐ మన్సూర్ అహ్మద్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అల్లే సాయినాథ్ రెడ్డి, సొసైటీ మెంబర్ పాటిల్ కపిల్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

బత్తలపల్లి: సాయంత్రం 4 గంటలలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకుని క్యూ లైన్‌లో ఉంటే వారికి స్లిప్‌లు ఇచ్చి ఓటింగ్‌కు అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు హరిజవహర్‌లాల్, పోల భాస్కర్‌లు ఎన్నికల సిబ్బందికి సూచించారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. 4 గంటలలోపు ప్రధాన ద్వారం మూసివేయాలని సూచించారు. వారి వెంట ఆర్డీఓ తిప్పేనాయక్, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహ శర్మ, విఆర్‌ఓలు తదితరులు ఉన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో 2 పోలింగ్ బూత్‌లలో గ్రాడ్యుయేట్లు, 1 పోలింగ్ బూత్‌లో టీచర్లు తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు. గట్టి బందోబస్తు ఉండడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 1357 పట్టబద్రులు ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకోగా అందులో 930 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా 87 మంది టీచర్లకు గాను 82 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రథోత్సవం ముగిశాక పోటెత్తారు..

కదిరి అర్బన్: పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బాలుర ఉన్నత పాఠశాలలో 3 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు, బాలికల ఉన్నత పాఠశాలలో 2 పట్టభద్రులు, 1 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సతీమణి ఉషారాణి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి రద్దీ లేకపోయినప్పటికీ రథోత్సవం ముగిశాక ఓటర్లు చాలా మంది క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సూర్యనారాయణ పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

నల్లచెరువు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 757 పట్టభద్రుల ఓటర్లుకు గానూ 562 మంది ఓటు వేశారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 32 మంది ఉండగా, ఎన్నికల్లో 31 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని కదిరి డీఎస్పీ భవ్యకిషోర్ పరిశీలించారు.

తలుపుల: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో పట్టభద్రులు 872 మందికి గాను 667 మంది, ఉపాధ్యాయులు 54 మందికి గాను 51 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ప్రక్రియను తహసీల్దార్ క్రాంతికుమార్, రూరల్ సీఐ శివశంకర్ నాయక్, ఎస్‌ఐ మగ్బుల్‌బాషు పర్యవేక్షణలో ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లలో 83.53శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. అదే విధంగా ఉపాధ్యాయ ఓటర్లలో 93 శాతం మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి సువర్ణకుమార్ తెలిపారు. పోలింగ్ సరళిని కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర పరిశీలించారు. తహసీల్దార్ రవి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పోలింగ్ కేంద్రం వద్ద పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని మారుమూల గ్రామమైన పాయకట్టు నుంచి పట్టభద్రులైన మహిళలు చంటి బిడ్డలతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం.

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉస్తినిపల్లికి చెందిన పర్వానా అనే మహిళ తన ఓటును ఎవరో వేసేశారని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. తాను ఓటు వేయాల్సిందేనని పట్టుబట్టడంతో చివరకు అధికారులు ఆమెతో చాలెంజింగ్ ఓటును వేయించారు. పట్టభద్రులు 79 శాతం, టీచర్లు 89.65 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని కదిరి డీఎస్పీ భవ్య కిషోర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రాంభూపాల్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలో ఉదయం నుంచే పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ బూత్‌కు క్యూ కట్టారు. ఎన్నికల సరళిని కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర స్థానిక తహసీల్దార్ రవినాయక్‌తో కలిసి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతంగా పోలింగ్

కనగానపల్లి: మండలంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 73.1 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 86 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలో 969 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 709 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక ఉపాధ్యాయ ఓటర్లు 22 మందికి గాను 19 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని ధర్మవరం ఆర్డీఓ నాగరాజునాయక్, ధర్మవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ హుసేన్ పీరా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్ వెంకటరమణ, ఎస్‌ఐ హనుమంతరెడ్డి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

రామగిరి: మండలంలో పట్టభద్రులు 627మంది ఉండగా 486 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 77.5 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఓట్లు 12 10 మంది ఓటును వినియోగించుకోగా 88 శాతం ఓటింగ్ నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ, ఆర్డీఓలు పోలింగ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఎస్‌ఐ జనార్ధన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


చెన్నేకొత్తపల్లి: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. 49 మంది ఉపాధ్యాయులకు గాను 47 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.9 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే గ్రాడ్యుయేట్ ఓటర్లు 1,399 మందికి గాను 1,054 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 75.33 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్, డీఎస్పీ హుస్సేన్ పీరా తనిఖీ చేశారు. రామగిరి ఎస్‌ఐ చిన్న గౌస్, ఎస్‌ఐ శ్రీధర్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మండలం	టీచర్ల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)	పట్టభద్రుల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)
పుట్టపర్తి	112-98	1,737-1,340
కొత్తచెరువు	120-114	17,15-1,347
బుక్కపట్నం	67-55	920-688
ఓడీసీ	53-50	1,028-761
నల్లమాడ	81-73	956-713
అమడగూరు	28-27	558-407

మండలం	టీచర్ల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)	పట్టభద్రుల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)
ధర్మవరం , మండలం	487-464	6,291-4,933
ముదిగుబ్బ	87-82	1,357-930
తాడిమర్రి	20-18	820- 613
బత్తలపల్లి	58- 52	1,092-818

మండలం	టీచర్ల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)	పట్టభద్రుల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)
కదిరి	553-521	4,238-3,212
గాండ్లపెంట	30-28	686-573
ఎన్‌పీకుంట	28-26	601-458
తనకల్లు	29- 26	693-547
తలుపుల	54-51	872-667
నల్లచెరువు	32-31	757-562

మండలం	టీచర్ల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)	పట్టభద్రుల ఓటర్లు (ఉన్నవి-పోలైనవి)
కనగానపల్లి	22-19	969- 709
రామగిరి	12-10	627-486
చెన్నేకొత్తపల్లి	49-47	1,399-1,054



కదిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి సతీమణి డాక్టర్ ఉషారాణి



బత్తలపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న పరిశీలకులు



కనగానపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి